**ఫిజికల్ సైన్స్ టీచర్ కు ఫిజికల్ సైన్స్ టీచర్ అని పిలిపించుకునే అర్హత లేదా? మరి ఏమని పిలవాలి ?**

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రము చాలా సంవత్సరాలుగా నలుగుతున్న సమస్య. 6 నుండి 10 తరగతుల వరకు నిర్వహించ బడుతున్న ఉన్నత పాఠశాలల్లో ఉన్న విపత్కర పరిస్థితుల గురించి విశ్లేషణ చేసుకుందాం. గణిత టీచర్లందరూ మొదటి నుండి ఉన్నవారే. అప్పట్లో వారు గణిత టీచర్లు కనుక (ఇప్పుడు కాదని నా అభిప్రాయం కాదు) 6 నుండి 10 తరగతుల వరకు గణితము ను బోధించుచుండెడివారు. ఎస్.జి.టి. లు ఉన్న చోట 6, 7 గణితం మరియు ఒక సైన్స్ ఎస్.జి.టి. బోధించేవారు. మా చిన్న నాటి కాలంలో అలాగే జరిగింది. మీ చిన్ననాటి కాలంలో కూడా అలాగే జరిగి యుండవచ్చును. గణితం, సైన్సు మరియు సోషల్ టీచర్ పోస్టులతో పాటుగా తెలుగు మరియు హిందీ టీచర్ పోస్టులు అప్పట్లో కలవు. ఇంగ్లీషు మరియు ఫిజికల్ సైన్స్‌లకు ప్రత్యేక పోస్టులు కేటాయించలేదు. సైన్స్ టీచర్లే ఫిజికల్ సైన్స్ బోధించేవారు. కొన్ని చోట్ల గణిత టీచర్లు ఫిజికల్ సైన్స్ బోధించేవారు. సోషల్ టీచర్లు ఇంగ్లీషు కూడా బోధించేవారు.

అప్పట్లో ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్స్ (బి.యిడి. టీచర్స్) తో పాటుగా ఎస్.జి.టి. లు కూడా ఉండేవారు. ఆ తరువాత కాలంలో ఉన్నత పాఠశాలలలో విషయాల వారీగా ఉపాధ్యాయులు ఉండాలని, ఏ విషయాన్ని ఆ ఉపాధ్యాయుడే బోధించిన మంచి ఫలితాలు వస్తాయని సూచించే ప్రభుత్వ నిబంధనల మేరకు ఇంగ్లీషు మరియు ఫిజికల్ సైన్స్ టీచర్ పోస్టు లను కేటాయించినారు. అంతకు పూర్వం పనిచేస్తున్న గణిత టీచర్లను , సైన్స్ టీచర్లను ఫిజికల్ సైన్స్ మెథడాలజీ నేపథ్యం ఉన్నవారిని ఫిజికల్ సైన్స్ టీచర్లుగా ఉండడానికి కన్వర్షన్ ఆప్షన్ ఇవ్వడం ద్వారా ఎంపిక చేశారు. (అంటే ప్రస్తుతం ఫిజికల్ సైన్స్ టీచర్లలో కొంత మంది గణితం బోధించిన వారేనని చెప్పనవసరం లేదు.) నూతన రిక్రూట్‌మెంట్‌ల ద్వారా ఫిజికల్ సైన్స్ టీచర్ పోస్టులు ఎంపిక చేస్తుండడం జరుగుతున్నది. దాదాపు 12 సంవత్సరాల నుండి ఈ విభజన జరిగినది. ఫిజికల్ సైన్స్ అనే విషయం 8, 9, 10 తరగతులకు మాత్రమే ప్రత్యేక సబ్జెక్టుగా ఉన్నది. ఇది 6, 7 తరగతులకు సామాన్య శాస్త్రముగా ఉంది. ఫిజికల్ సైన్స్ టీచర్ 8, 9, 10 తరగతుల ఫిజికల్ సైన్స్ బోధించుటకు నియమించబడిన వ్యక్తి అని గమనించాలి. ఈ విషయం రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ల ద్వారా స్పష్టంగా తెలియుచున్నది. గణితం సబ్జెక్టుతో సంబంధం లేదని కూడా తెలుస్తుంది.

**ఫిజికల్ సైన్స్ టీచర్ల అర్హతలు**

**2008 డి.ఎస్.సి. నోటిఫికేషన్ నందు ఫిజికల్ సైన్స్ టీచర్ల అర్హతలు :**

**School Assistant (Physical Sciences)** :- A Bachelors Degree with Physics and Chemistry as optional subjects or one of the two as main and the other as subsidiary/ancillary Subject and a B.Ed. Degree with Physical Science / Physics / Chemistry as a methodology subject.

**2012 డి.ఎస్.సి. నోటిఫికేషన్ నందు ఫిజికల్ సైన్స్ టీచర్ల అర్హతలు :**

**School Assistant (Physical Sciences)** :- Must posses a Bachelors Degree with at least two of the following subjects as optional subjects: Physics / Applied Physics / Engineering Physics & Instrumentation/ and Chemistry / Applied Chemistry / Industrial Chemistry / Pharmaceutical Chemistry / Medicinal Chemistry / Bio-Chemistry / Geology or either Physics / its allied subjects or Chemistry / its allied subjects as one of the main subject and other as subsidiary / ancillary subject and B.Ed. degree with Physical Science / Physics / Chemistry / Science as a methodology subject.

**2015 డి.ఎస్.సి. నోటిఫికేషన్ నందు ఫిజికల్ సైన్స్ అర్హతలు :**

**School Assistant (Physical Sciences)** :- Must posses a Bachelors Degree with at least two of the following subjects as optional subjects: Physics / Applied Physics / Engineering Physics & Instrumentation and Chemistry / Applied Chemistry / Industrial Chemistry / Pharmaceutical Chemistry / Medicinal Chemistry / Bio-Chemistry / Geology or either Physics / its allied subjects or Chemistry / its allied subjects as one of the main subject and other as subsidiary / ancillary subject and B.Ed. degree with Physical Science / Physics / Chemistry / Science as a methodology subject.

అర్హతల అంశాలను పరిశీలిస్తే రిక్రూట్‌మెంట్ రోజున నుండి కూడా ఫిజికల్ సైన్స్ టీచర్ 8, 9, 10 తరగతుల ఫిజికల్ సైన్స్ బోధించుటకు నియమించబడిన వ్యక్తి అని గమనించాలి. ఈ విషయం రిక్రూట్‌మెంట్ కొరకు ఇవ్వబడిన నోటిఫికేషన్ల ద్వారా స్పష్టంగా తెలియుచున్నది. ఉన్నత పాఠశాలల్లో గణితానికి వారానికి 8 పీరియడ్లు, ఫిజికల్ సైన్స్‌కు 4 పీరియడ్లు, బయాలజీకి 4 పీరియడ్లు ఉండేవి. కనుక ఒకప్పుడు 2 గణిత పోస్టులు, 1 సైన్స్ టీచర్ పోస్టు ఉండేది. ఒకే మీడియం. ఒక గణిత టీచర్ 3 తరగతులకు 24 పీరియడ్లు, మరో గణిత టీచర్ లేదా ఎస్.జి.టి. 2 తరగతులకు గణితం మరియు 1 తరగతికి సైన్స్‌తో 24 పీరియడ్లు, సైన్స్ టీచర్ 8, 9, 10 తరగతులకు ఫిజికల్ సైన్స్ 12 పీరియడ్లు, బయాలజీ 12 పీరియడ్లు, ఒక

తరగతికి సైన్స్ 8 పీరియడ్లు మొత్తం 24 పీరియడ్లు బోధించేవారు. ఫిజికల్ సైన్స్ టీచర్ పోస్టు మంజూరు చేసినపుడు ఫిజికల్ సైన్స్ టీచర్ 8, 9, 10 తరగతులకు ఫిజికల్ సైన్స్ 4 పీరియడ్ల చొప్పున 12 పీరియడ్లు బోధించగా, బయాలజీ టీచర్ 8,9,10 తరగతుల బయాలజీకి గాను12 పీరియడ్లు మరియు 6వ తరగతి సైన్స్‌కు 8 పీరియడ్లు మొత్తం 20 పీరియడ్లు. ఒక గణిత టీచర్ 8, 9, 10 తరగతుల గణితానికి 24 పీరియడ్లు బోధించగా మరో గణిత ఉపాధ్యాయుని పోస్టు అధికం అయింది. వర్క్ లోడ్ తగ్గింది.

అందువల్ల ఒక గణిత పోస్టును కుదించి లేదా అవసరమైన చోట ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు (బి.యిడి. నందు గణితం మెథడాలజీ ఉంటుంది గనుక) 6, 7 తరగతుల గణితం ఇవ్వవచ్చును అని ఒక మెమోను జారీ చేసినారు. (జి.ఓ. కాదు.) అప్పటి నుండి గణిత టీచర్లు 8, 9, 10 తరగతుల గణితానికి 24 పీరియడ్లు, ఫిజికల్ సైన్స్ టీచర్లు 8, 9, 10 తరగతుల ఫిజికల్ సైన్స్ 12 పీరియడ్లు, మరియు 6, 7 తరగతుల గణితం తో 16 పీరియడ్లు తో మొత్తం 28 పీరియడ్లు బోధిస్తున్నారు. బయోలజీ టీచర్లు 8, 9, 10 తరగతుల బయాలజీకి 12 పీరియడ్లు మరియు 6, 7 తరగతుల సైన్స్‌కు 16 పీరియడ్లు మొత్తం 28 బోధిస్తున్నారు. మొదటలో అవసరం ఉన్న చోట 6, 7 గణితం ను గణిత టీచర్లు కూడా తీసుకునే వారు. కానీ తర్వాత మానేశారు. మేము ఉన్నత స్థాయి గణిత టీచర్లము. 8, 9, 10 తరగతుల గణితం మాత్రమే చెప్తాము. చిన్న పిల్లలకు (6, 7 తరగతుల విద్యార్థులు)గణితం చెప్పడం మా బాధ్యత కాదు అని అనడం ప్రారంభించారు. సరే 4 పీరియడ్ల తేడానే కదా అని ఫిజికల్ సైన్స్ టీచర్లు సర్దుకున్నారు. గణిత టీచర్లు మాత్రం తమకు 3 తరగతులు, మాకు 5 తరగతులు అని సంతోష పడ్డారు. (ఎగ్జామ్స్ లో అన్ని పేపర్ బండిల్స్ దిద్దాలి కదా!).

ఫిజికల్ సైన్స్ టీచర్ 8,9,10 తరగతుల ఫిజికల్ సైన్స్‌ను 12 పీరియడ్లతోనూ మరియు 6, 7 తరగతుల గణితమును 16 పీరియడ్లతోనూ మొత్తం 28 బోధన పీరియడ్లను పంచుకొంటున్నారు. ఇది చాలాదయనీయమైన పరిస్థితి. ఒక ఉపాధ్యాయుడు రెండు రకముల విషయాలను బోధించుట విద్యా హక్కు చట్టానికి విరుద్ధం కాదా!

**ఫిజికల్ సైన్స్ టీచర్ ఫిజికల్ సైన్స్ కన్నా గణితమును అధికంగా బోధించుట ఏ విధంగా సమంజసము?**

**ఏ సబ్జెక్టుకు న్యాయం చేయాలి?**

**ఫిజికల్ సైన్స్ టీచర్ కు ఫిజికల్ సైన్స్ టీచర్ అని పిలిపించుకునే అర్హత లేదా? మరి ఏమని పిలవాలి ?**

ఇంగ్లీషు మీడియం ను పాఠశాలల్లో అమలు చేసిన తర్వాత ఫిజికల్ సైన్స్ టీచర్ల బాధలు వర్ణనాతీతం. ఒక పాఠశాలలో రెండు మీడియంలు. 2 గణిత పోస్టులు, 1 ఫిజికల్ సైన్స్ పోస్టు ఉన్నది అనుకుందాం. న్యాయంగా అయితే ఒక గణిత టీచర్ 7, 8, 9, 10 తరగతులకు గానూ గణితం 32 పీరియడ్లు చెప్పాలి. ఫిజికల్ సైన్స్ టీచర్ 8, 9, 10 తరగతుల ఫిజికల్ సైన్స్ 24 పీరియడ్లుమరియు 6 వ తరగతి గణితం 16 పీరియడ్లు తీసుకుంటే మొత్తం 40 పీరియడ్లు అవుతాయి. అలా చెప్పడానికి ఫిజికల్ సైన్స్ టీచర్ సిద్ధపడినా కూడా చాలా చోట్ల గణిత టీచర్లు 7 వతరగతి గణితం చెప్పడానికి నిరాకరించడంతో 6, 7 తరగతులకు ఫిజికల్ సైన్స్ టీచరే గణితం చెప్పాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అప్పుడు 56 పీరియడ్లు. పాఠశాలలో జరిగేదే 48 పీరియడ్లు అయితే 56 ఎక్కడ నుండి తేవాలి. అందుకోసం ఫిజికల్ సైన్స్ టీచర్లు రెండు మీడియం లను కలుపుకుని కూడా పాఠాలు బోధించగా 40 పీరియడ్లు పని భారం. గణిత టీచర్లు మాత్రం 24 నుంచి కదిలేవారు కాదు. మరి ఆ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎందుకు వారిని వెనుకేసుకు వస్తారో అర్థం కాదు. (ప్రధానోపాధ్యాయుల సంఘం వారు మన్నించాలి. ఇలా వ్రాసినందుకు. కొందరు మంచి వారు ఉన్నారు. ఫిజికల్ సైన్స్ టీచర్లు అన్యాయంగా అడిగి యుండలేదు కదా!).

ఒక సందేహం. గణిత టీచర్లు గణితం చెప్పడానికి ఎందుకు ఫీలవుతున్నారో ? అర్థం కావడం లేదు. స్కూల్ అసిస్టెంట్ గణితం టీచర్లు 6 నుండి 10 తరగతుల గణితం బోధించడానికి ఉద్దేశింపబడినవారా?! లేదా 8, 9, 10 తరగతులకు కేవలం 3 తరగతుల గణితం కోసం మాత్రమే ఉద్దేశింపబడినవారా?! ఒక వేళ అదే నిజమనుకుంటే ప్రాథమికోన్నత పాఠశాలలో గణిత టీచరును ఎందుకు కేటాయించాలి. గణిత మిత్రులు మన్నించాలి. ఒక సామెత గుర్తుకు వస్తున్నది. 'వెనకటికి ఎవరో బాగా ఆర్జించిన తర్వాత చింతకాయలను చూసి వంకరటింకరగా ఉన్నాయి. ఇవేం కాయలు అని అడిగారట.' అలా ఉంది వీరి వరస. గణిత టీచర్లు 6, 7 తరగతుల గణితం అవసరమైన సందర్భంలో కూడా బోధించకుండా మిన్నకుండడం అనేది అలా చేసిన వారి బాధ్యతా రాహిత్యం కాదంటారా! ఉన్నత పాఠశాలలనుండి ఎస్.జి.టి. లను తొలగించి బి.యిడి. అసిస్టెంట్ పేరును పాఠశాల సహాయకులు అని మార్చినపుడే 6 నుండి 10 తరగతుల గణితం బోధించడానికి వారిని కేటాయించినారని తెలుస్తుంది. ( తెలుగు టీచర్లనం కూడా గతంలో గ్రేడ్-1 పోస్టు ఉండేది. వారు కేవలం 8, 9, 10 తరగతుల తెలుగును బోధించే వారు. అందుకని వారు 6, 7 తరగతులకు తెలుగు చెప్పడం కోసం స్కూల్ అసిస్టెంట్ గా నామకరణం చేశారు. కొన్ని ఉన్నత పాఠశాలల నుండి లాంగ్వేజి పండిట్ గ్రేడ్-2 లను తొలగించారు/ పదోన్నతి కల్పించారు. ఈ విషయం మనం అర్థం చేసుకోవాలి.)

ఇదిలా ఉంటే పీరియడ్ల సమస్య మరొకటి. గణితానికి ఎంత ప్రాధాన్యత ఉందో సైన్స్‌కు అంతే ప్రాధాన్యత ఇవ్వాలని ఉద్దేశ్యంతో గణితానికి 8 పీరియడ్లు కనుక సైన్స్‌కు కూడా 8 పీరియడ్లు కేటాయించినారు. అందువల్ల 8, 9, 10 తరగతులకు ఫిజికల్ సైన్స్‌కు 4 పీరియడ్లు మరియు బయోలాజికల్ సైన్స్‌కు 4 పీరియడ్లు కేటాయించినారు. గతంలో అనగా 1998 కి ముందు ఉన్న ఫిజికల్ సైన్స్ మరియు బయాలజీ పుస్తకాలకు ఆ పీరియడ్లు సరిపోయి ఉండవచ్చు. అయితే 1998 ఫిజికల్ సైన్స్ పాఠ్య పుస్తకం చూసిన తర్వాత ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు కళ్ళు తిరిగిపోయాయి. పాఠాలకు భయపడి కాదు. ఆ సిలబస్‌ను వారానికి కేటాయించిన 4 పీరియడ్లలో చెప్పడం అసాధ్యం కనుక. పాఠాలకు కొందరు భయపడిన మాట కూడా వాస్తవం. అంగీకరించాల్సిందే. ఆ సిలబస్‌ను పూర్తి చేయడానికి 4 పీరియడ్లు సరిపోవు అని ఎన్నో సార్లు ఫిజికల్ సైన్స్ టీచర్లు మొరపెట్టుకున్నా అధికారులు కనికరించలేదు. అయినా అదనపు పీరియడ్లు ప్రధానోపాధ్యాయులకు చెప్పి వేయించుకుని సిలబస్ ను పూర్తి చేయడం కోసం తలమునకలైపోయేవారు. పైగా ఇటు ఫిజికల్ సైన్స్ తో పాటుగా అటు గణితం కూడా ప్రిపేర్ కావలసి వచ్చేది.

ఆ తర్వాత 4 సంవత్సరాల క్రితం జి.ఓ. నెంబర్ 55 ద్వారా ఫిజికల్ సైన్స్‌కు 5 పీరియడ్లు కేటాయించడం జరిగినది. అపుడు కూడా గణిత టీచర్లు 24 పీరియడ్లు, ఫిజికల్ సైన్స్ టీచర్లు 8, 9, 10 తరగతులకు ఫిజికల్ సైన్స్ 15 పీరియడ్లు మరియు 6, 7 గణితం 16 పీరియడ్లు మొత్తం 31 పీరియడ్లు. తరగతుల సంఖ్య ఎక్కువగా ఉన్న చోట కొందరు 39 కూడా బోధించిన సందర్భాలున్నాయి. గణితం వారు కొన్ని చోట్ల పంచుకున్నారు. కొన్ని చోట్ల భీష్మించుకున్నారు. అయినా ఫిజికల్ సైన్స్ టీచర్ల తిప్పలు తప్పలేదు. విద్యా హక్కు చట్టం వచ్చి ఇన్ని సంవత్సరాలైనది. అయినా దానిని అమలు పరచడంలో ఉదాసీనత స్పష్టంగా కనిపించినది గతంలో. విద్యా హక్కు చట్టం ప్రకారం ఒక ఉపాధ్యాయుడు ఒక విషయానికి మాత్రమే బాధ్యత వహించాలి. ఒక విషయాన్ని మాత్రమే బోధించాలి. అలాంటిది ఫిజికల్ సైన్స్ టీచర్ రెండు విష్యయాలను బోధించుట ఏ విధంగా సమంజసము? 12 విద్యా ప్రమాణాలను (గణితం మరియు ఫిజికల్ సైన్స్ లలో) విద్యార్థులలో సాధింపజేయుట ఏ విధంగా సాధ్యము?

గమనించదగిన మరో విషయం ఏమిటంటే ఫిజికల్ సైన్స్ టీచర్లుగా ఉన్న వారిలో గతంలో ప్రమోషన్ పొందడం ద్వారా ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ గా మారిన వారు కొందరు ఉన్నారు. వారికి ఇంటర్ మీడియట్‌లో గానీ డిగ్రీ నందు గానీ బి,యి.డి. నందు గానీ గణితం ఒక సబ్జెక్టుగా ఉండదు. అనగా వారి 10 వ తరగతి నాటితో గణితం యొక్క రుచి తప్పి ఉండవచ్చు. (ఇలా వ్రాస్తున్నందుకు మిత్రులు మన్నించాలి. వారిలో కూడా గణిత నిష్ణాతులు ఉండవచ్చు.)వారు ప్రస్తుతం ఫిజికల్ సైన్స్ తో పాటుగా గణితం బోధించడానికి, పైగా 30 దాటిన పీరియడ్లను బోధించడానికి చాలా శ్రమను ఓర్చి కష్టపడుతున్నారు. అలాంటి పరిస్థితుల్లో కూడా కొన్ని చోట్ల మన గణిత మిత్రులు 'తాను పట్టిన కుందేటికి మూడే కాళ్ళు అన్న చందంగా వ్యవహరిస్తున్నారు.' ఇది న్యాయమా?!

అందినా పాఠ్య పుస్తకాలు మారినాయి. సిలబస్ బాగా మారిపోయింది. సైన్స్ రంగంలో ముఖ్యంగా ప్రయోగాలు, ప్రాజెక్టు పనులు, కృత్యాధార బోధనకు ప్రాధాన్యత ఇవ్వబడినది. జి.ఓ. నెంబర్ 55 ప్రకారం కొన్ని చోట్ల 5 పీరియడ్లు వేశారు. కొన్ని పాఠశా లల్లో ఆ జి.ఓ. తమకు తెలియదంటూ 4 పీరియడ్లనే కేటాయించారు ఫిజికల్ సైన్స్ టీచర్లకు. ఇంకా పరిశీలిస్తే గత పదవ తరగతి పాఠ్య పుస్తకం కంటే ప్రస్తుత పాఠ్య పుస్తకం నందు అనేక కృత్యాలు, ప్రయోగాలు ఇవ్వడం జరిగినది. సిలబస్ పెరిగినది (పాఠాల సంఖ్య తగ్గినప్పటికీ). కనుక ఖచ్చితంగా 6 పీరియడ్లు కేటాయించాలని , ప్రయోగాలకు 1 అదనపు పీరియడ్ కేటాయించాలని ఫిజికల్ సైన్స్ టీచర్లు అనేక మార్లు కోరడం జరిగనది.

అయితే అన్ని కాలాలు ఒక లాగా ఉండవు. ప్రతి ఒక్కరికీ ఏదో ఒక రోజు వస్తుంది. ఆ కోవ లోనే ప్రస్తుతం అధికారులు విద్యా హక్కు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడంలో భాగంగా ఏ సబ్జెక్టు టీచర్ ఆ సబ్జెక్టన్ బోధించాలి. అని తెలియ జేస్తూ నూతనంగా ఇటీవల ఉపాధ్యాయుల వర్క్‌లోడ్‌ను కేటాయించడం జరిగినది. ఫలితంగా గణిత టీచర్ 6 నుండి 10 వరకు అన్ని తరగతులకు గణితమును బోధించాలి. 35 పీరియడ్ల వర్క్ లోడ్. ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు 8, 9, 10 తరగతుల ఫిజికల్ సైన్స్‌కు 5 పీరియడ్లకు తోడుగా రెండు వారాలకు ఒక ప్రయోగశాల పీరియడ్ కేటాయించడం జరిగినది. పైగా విలువల విద్య, పని విద్య, కంప్యూటర్ విద్య మొదలైన అదనపు పీరియడ్లను ఉపాధ్యాయులకు కేటాయించడం లో భాగంగా ఉపాధ్యాయులవర్క్ లోడ్ 32 గా ఇటీవల సవరించడం జరిగినది.

సరి పోయింది గదయ్యా ఇంకా ఎందుకు నీ బాధ?! అని అడుగుతారు కదా! అందరూ.

**WORK LOAD WITH SUBJECT DISTRIBUTION- FOR VI AND VII CLASSES**
**( Regular periods- 34 other periods -14 total = 48 periods)**

| Subject | No. of periods in a week | Classes VI & VII | Total Subject periods in a week | Other periods (value Edn, Art Edn, Work Edn, Library) | Total Periods |
|---|---|---|---|---|---|
| Telugu | 5 | 10 Periods | 10 | 4 | 14 |
| Hindi | 4 | 8 Periods | 8 | 6 | 14 |
| English | 5 | 10 Periods | 10 | 4 | 14 |
| Mathematics | 7 | 14 Periods | 14 | - | 14 |
| Science | 6 | 12 Periods (B.S. Teacher VI class 6 periods, | 12 (2 lab)=14 (B.S. Teacher VI class 6 periods + 1 lab period = 7, | B.S. Teacher 7 periods | 14 |
| | | P. S. Teacher VII class 6 periods) | P. S. Teacher VII class 6 periods + 1 lab period = 7) | P.S. Teacher 7 periods | 14 |
| Science Laboratory | 1 | 2 Periods (1 period each class) | 2 | - | - |
| Social studies | 5 | 10 Periods | 10 (2 Cotemporary issues-seminar)=12 | - | 12 |
| Social studies (Contemporary issues- seminar) | 1 | 2 Periods (1 period each class) | 2 | - | - |
| Physical Education | 3 | 6 Periods | - | - | 6 |
| Value Education | 3 | 6 Periods | - | - | - |
| Art Education | 3 | 6 Periods | - | - | - |
| Work Education | 3 | 6 Periods | - | - | - |
| Library | 2 | 4 Periods | - | - | - |
| Total | 48 | | | | |

**WORK LOAD WITH SUBJECT DISTRIBUTION- FOR VIII, IX, X CLASSES**
**( Regular periods- 37 other periods -11 total = 48 periods)**

| Subject | No. of periods in a week | Classes VIII, IX & X | Total Subject periods in a week | Other periods (value Edn, Art Edn, Work Edn, Library) | Total Periods |
|---|---|---|---|---|---|
| Telugu | 5 | 15 Periods | 15 | 6 | 21 |
| Hindi | 4 | 12 Periods | 12 | 8 | 20 |
| English | 5 | 15 Periods | 15 | 5 | 20 |
| Mathematics | 7 | 21 Periods | 21 | - | 21 |
| Physical Science | 5 | 15 Periods | 15+ 1 Lab Period = 16 | 5 | 21 |
| Biological Science | 4 | 12 Periods | 12+2 Lab Period = 14 | 7 | 21 |
| Science Laboratory | 1 | 3 Periods (1 period each class) | - | - | - |
| Social studies | 5 | 15 Periods | 15 (3 Cotemporary issues-seminar)=18 | 2 | 20 |
| Social studies (Cotemporary issues- seminar) | 1 | 3 Periods (1 period each class) | - | - | - |
| Physical Education | 3 | 9 periods | 9 periods | - | 9 |
| Value Education | 2 | 6 periods | | | |
| Art Education | 2 | 6 periods | | | |
| Work Education | 2 | 6 periods | | | |
| Library | 2 | 6 periods | | | |
| Total | 48 | | | | |

**సరి పోయింది గదయ్యా ఇంకా ఎందుకు నీ బాధ?! అని అడుగుతారు కదా! అందరూ.**

దేవుడు వరమిచ్చినా కూడా పూజారి కరుణించలేదు అన్నట్లు ఉత్తర్వులు విడుదల అయ్యి నెల రోజులు కావస్తున్నా చాలా పాఠశాలల్లో దీనిని అమలు జరపడం లేదు. ఇంకా శోచనీయ పరిస్థితి ఏమిటంటే ఆయా పాఠశాలల్లో ఇప్పటికీ రోజుకు 9 పీరియడ్ల ప్రకారం తరగతులు అమలు అవుతున్నాయి. (ముఖ్యంగా గణిత సబ్జెక్టు గల ప్రధానోపాధ్యాయులు ఉన్న చాలా చోట్ల, మిగిలిన కొన్ని చోట్ల గణిత ఉపాధ్యాయుల ఒత్తిడి వల్ల లేదా 6, 7 గణితం చెప్పమని నిరాకరించడం వల్ల). ఇదేం అన్యాయం. గణిత ఉపాధ్యాయులను గణితం బోధించమనడం తప్పా. ప్రస్తుత ఉత్తర్వులను ఎవరో బలవంతంగా ఇప్పించినారు. ఈ వర్క్ లోడ్‌ను మేము మార్పిస్తాము. కొంత కాలం పాత కాలక్రమ పట్టికనే అమలు చేద్దాం. అంటూ చాలా పాఠశాల్లో 9 పీరియడ్లను అమలు చేస్తూ అటు ఫిజికల్ సైన్స్ టీచర్లనే కాకుండా విద్యార్థులను కూడా ఇబ్బంది ( భోజన సమయం మధ్యాహ్నం 20 నిమిషాలు తేడా వస్తుంది కదా! చిన్న పిల్లలు వేచి ఉండాలి కదా!) పెడుతున్నారు. బలబంతంగా ఉత్తర్వులు ఇప్పించడానికి విద్యాశాఖ అధికారులే మీ చిన్న పిల్లఉ కాదు కదా! ప్రస్తుతం గణిత టీచర్లను 6 నుండి 10 వరకు అన్ని తరగతుల తరగతుల గణితాన్ని వారానికి 7 పీరియడ్ల చొప్పున 35 పీరియడ్లు బోధించమన్నారు. (గణితానికి 8 పీరియడ్లు సరిపోవు. 10 పీరియడ్లు చేసి 8, 9, 10 తరగతుల గణితానికి 30 పీరియడ్లు ఇవ్వాలని మరో వాదన. అయితే బాగా గమనిస్తే గతంలో కంటే ఫిజికల్ సైన్స్ 10 వ తరగతి సిలబస్ పెరిగింది. గణితం సిలబస్ తగ్గింది. ఈ మాట గణిత ఉపాధ్యాయులు కూడా అంగికరించే వాస్తవం. తేడా 3 తరగతులు మించి ఇవ్వవద్దని మాత్రమే వారి విన్నపములాగా కనిపిస్తుంది. మరో వాదన ఏమిటంటే 50 మార్కుల పేపరుకు 6 పీరియడ్లు ఎందుకు? వంద మార్కుల పేపరుకు 8 సరిపోక పోతే 7 చేశారు. పది చేయాలని మరో వాదన. ముఖ్యంగా గమనించాల్సింది. ఎన్ని పేపర్లు? ఎన్ని మార్కులు అని కాదు? విషయ ప్రాధాన్యత. కాఠిన్యతా స్థాయి. అలా కాకుంటే వంద మార్కుల హిందీ విషయానికి 4 పీరియడ్లు మాత్రమే ఎందుకు కేటాయించారు. వారికి కూడా 8 ఇవ్వమని కోరవచ్చు కదా! 50 మార్కుల ఫిజికల్ సైన్స్ పుస్తకాన్ని గణితంతో సమానంగా అంత పెద్దగా ఎందుకు చేశారు? దానిని తెలుగు పుస్తకంలాగా చేయవచ్చు కదా! ఇలాంటి వాదన లన్నీ సరదాగా మాట్లాడుకోవడానికి తప్ప చెల్లుబాటు కావు కదా! ) ఫిజికల్ సైన్స్ టీచర్లకు 8 నుండి 10 వరకు ఫిజికల్ సైన్స్‌ను వారానికి5 పీరియడ్లు మరియు ప్రయోగశాల పీరియడ్ దానితో పాటుగా 7 వతరగతి సైన్స్‌ను 7 పీరియడ్లతో కలిపి అదనపు పీరి యడ్లనుచేర్చి వారానికి 32 పీరియడ్ల వర్క్ లోడ్ కేటాయించినారు. అయినప్పటికీ ఉత్తర్వులు వెలువడి నెలరోజులు సమీపిస్తున్నా ఇప్పటికీ చాలా పాఠశాలల్లో అమలు చేయడం జరుగలేదు. పైగా వర్క్ లోడ్ మార్పిస్తున్నాము.... కోర్టుకు వెళతాము... 8, 9, 10 మాత్రమే చెబుతాము అని మభ్య పెడుతూ కాలం వెళ్ళదీస్తున్నారు ప్రధానోపాధ్యాయులు.

విద్యా హక్కు చట్టం ప్రకారం ఫిజికల్ సైన్స్ టీచర్ ఫిజికల్ సైన్స్ ను మాత్రమే బోధించాలి. అతని రిక్రూట్‌మెంటుకు అర్హ త ఫిజిక్స్ లేదా కెమిస్ట్రీ లేదా తత్సంబంధ విద్యా విషయాలే తప్ప గణితం అతని అర్హ తగా ఉండవలసిన అవసరం లేదు. ఉదాహరణకు డిగ్రీ నందు గణితం లేకుండా ఫిజిక్స్ మరియు కెమిస్ట్రీ చదివి ఉండవచ్చు. అలాంటి వారు గణితం బోధించుటకు అనర్హు లు. అదే విధంగా బి.యిడి. నందు ఫిజికల్ సైన్స్ తో పాటుగా గణితం మెథడాలజీగా లేకుండా తెలుగును గానీ లేదా ఇంగ్లీషును గానీ మెథడాలజీగా చేసి యుండవచ్చును. అలాంటి వారు గణిత బోధనను ఏ విధంగా చేయడానికి అర్హు లౌతారు. గణితం చదివిన వారే గణిత బోధనకు నిరాకరిస్తే, గణితం చదవినా లేదా చదవకున్నప్పటికీ ఫిజికల్ సైన్స్ టీచర్ గణితం బోధించాలనడం ఎంత వరకు న్యాయం? ఏ విధంగా సమంజసం? అలా అడిగే వారికి ఏ ఉపాధ్యాయ సంఘము కూడా ఎలా సహకరించగలదు? అడిగే విషయంలో న్యాయం ఉండాలి? చట్ట ప్రకారం ఉండాలి?

అయ్యా ! దయచేసి ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులను ఫిజికల్ సైన్స్ కొరకు మాత్రమే వినియోగించుకునేలా చేయండి. విద్యా హక్కు చట్టాన్ని సమర్థవంతంగా అమలు పరచడంలో భాగంగా వర్క్ లోడ్ కొరకు కేటాయించిన ఉత్తర్వులను అన్ని పాఠశాలల్లో అమలు జరిగే లాగున చూడవలసిందిగా అందరినీ కోరుతున్నాము. అధికారులు వీటిని అమలు చేయవలసిందిగా ప్రార్థించుచున్నాము.

**ఇంకా ఆసక్తికర విషయం ఏమిటంటే**

| అంశము | దినముల సంఖ్య | మిగిలిన దినముల సంఖ్య |
|---|---|---|
| ఒక విద్యా సంవత్సరంలో పాఠశాల గరిష్ట పని దినాల సంఖ్య | 220 | 220 |
| నిర్మాణాత్మక మదింపు / యూనిట్ టెస్ట్ ల కొరకు కేటాయించబడినవి | 12 | 208 |
| సంగ్రహణాత్మక మదింపు - 1 కొరకు | 7 | 201 |
| సంగ్రహణాత్మక మదింపు - 2 కొరకు | 7 | 194 |
| పునశ్చరణ తరగతుల కొరకు కేటాయించబడిన దినముల సంఖ్య ( అనగా ప్రీ పబ్లిక్ ఎగ్జామ్స్ ఫిబ్రవరి నెలలోనే నిర్వహించబడతాయి కనుక ఫిబ్రవరి, మార్చి, ఏప్రియల్ నెలల్లో పనిదినాలు 22 + 22 + 18 రోజులు పదవ తరగతి బోధనలో తోడ్పడవు. పూర్తి అయిన పాఠాలను రివిజన్ చేయించుట జరుగును.) | 62 | 132 |
| ఉపాధ్యాయుల వ్యక్తిగత సెలవులు (గరిష్టంగా జూన్ - జనవరి వరకు 8 నెలలు 16 రోజులు) | 16 | 116 |
| ఆగష్టు 15, జనవరి 26 మొదలగు జాతీయ పండుగల సందర్భంలో క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల కొరకు సుమారుగా | 4 | 112 |
| సబ్జెక్ట్ కాంప్లెక్స్ (పాఠశాల సముదాయ సమావేశాలు) క కొరకు సుమారుగా | 5 | 107 |

ఇందులో మరో అంశం ఏమిటంటే ? బోధన పీరియడ్లు 120 ఇవ్వబడినాయి. లెక్కలో 107 తేలాయి. 13 రోజులే కదా సర్దుకోవచ్చు అని అనుకుంటే పొరబాటే. ఎందుకంటే 107 రోజులు లెక్క తేలాయి. కానీ ఫిజికల్ సైన్స్ బోధన కొరకు ప్రతి పాఠశాలలో వారానికి కేటాయించిన పీరియడ్ల సంఖ్య 5 మాత్రమే. అంటే ప్రతి 6 పని దినాలలో ఫిజికల్ సైన్స్ బోధనకు కేటాయించబడిన పీరియడ్లు 5 మాత్రమే. ఈ లెక్కన 107 రోజులకు గాను 89 పీరియడ్లు కేటాయించబడినాయి.

పదవ తరగతి ఫిజికల్ సైన్స్ పాఠ్య పుస్తకాన్ని 89 పీరియడ్లలో బోధించుట ఎవరికి సాధ్యము? ఈ పాఠ్య పుస్తకము నందు 350 పేజీలలో విషయ సమాచారంతో బాటుగా 8 ప్రయోగాలు, 87 కృత్యాలు ఇవ్వబడినాయి. ప్రయోగములు ప్రయోగశాలలో ప్రతీ విద్యార్థి చేత చేయించాలి కనుక 8 ప్రయోగాలకు 8 పీరియడ్లు అవసరమవుతాయి. ( అదీ కూడా ప్రతి తరగతిలో 30 మంది విద్యార్థులు ఉన్నప్పుడు సాధ్యం. కానీ కొన్ని పాఠశాలలలో 50-80 మంది విద్యార్థులు కూడా ఉన్నారు. అపుడు కష్టమవుతుంది.). ప్రయోగశాల పీరియడ్ కేటాయించినారు కనుక సరిపోతుంది.

120 పీరియడ్లలో బోధించవలసిన పాఠాలను 89 పీరియడ్లలో బోధించుట సాధ్యమా? అసలు సాధ్యం కాదు. మరికొన్ని పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సిలబస్‌ను డిసెంబర్ నెల లోపే పూర్తి చేయమని ఉపాధాయులపై ఒత్తిడి తెస్తున్న సందర్భాలు కూడా ఉన్నాయి. (ఈ విషయం వ్రాస్తున్నందుకు ప్రధానోపాధ్యాయుల సంఘం వారు దయచేసి మన్నించగలరని కోరుకుంటున్నాము.). ఈ పరిస్థితులలో ఉన్న వారికి 76 పీరియడ్లు మాత్రమే మిగులుతాయి. వీటికి తోడు కొన్ని పాఠశాలల్లో బోధనేతర సిబ్బంది లేకపోవడం వల్ల మరియు కొన్ని పాఠశాలల్లో ఉన్నప్పటికినీ కార్యాలయపు పనులు, ఇతర కార్యక్రమాలు సాధారణంగా గణిత, సైన్స్ టీచర్లలకు చేయడం తప్పనిసరిగా మారుతుంది.

ఇవే కాకుండా సంవత్సరం మధ్యలో వృత్త్యంతర ట్రైనింగ్ ప్రోగ్రాములు నిర్వహించడం దృష్ట్యా కనీసం 3 నుండి 5 రోజులు బోధనకు కరవు అవుతాయి. ఇంకా చెప్పాలంటే ఇన్‌స్పైర్ ప్రాజెక్ట్‌ల ప్రదర్శనకు 2 రోజులు, సైన్స్ ఫెయిర్ కు 2 రోజులు, చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్‌కు 2 రోజులు .... వంటివి పాల్గొనే ఆసక్తి కలిగిన ఉపాధ్యాయులకు బోధనలో అదనంగా తగ్గే రోజులు.

పాఠ్యపుస్తకాలు చాలా అందంగా ఉన్నాయి. సమాచారం ఇంకా బాగుంది. మరి ఈ సమాచార ఫలాలు విద్యార్థుల వరకూ తీసుకొని వెళ్ళే అవకాశం కూడా కల్పించాలి కదా! చాలా మంది అనుకోవచ్చు. ఈ పరిస్థితులలో ఫిజికల్ సైన్స్ టీచర్లు పాఠాలు చెప్పకుండా దాటవేస్తున్నారని. అది పొరబాటే. విద్యార్థులకు న్యాయం చేయడానికి పాఠశాల పని దినాలలో బోధనా పీరియడ్లకే పరిమితం కాక అదనపు తరగతులు నిర్వహించి బోధిస్తున్నారనుటలో అతిశయోక్తి లేదు. గతంలో ఈ అదనపు తరగతులను సెలవు దినాలలో గణిత ఉపాధ్యాయులు నిర్వహించేవారు. (ఇప్పుడు కూడా చాలా మంది నిర్వహిస్తున్నారు.) కానీ ప్రస్తుతం చాలా చోట్ల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు పీరియడ్లకే పరిమితం కాక అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు.

మరి సి.సి.ఇ. విద్యా విధానంలో ప్రాజెక్ట్ పనిని విద్యార్థి చేసిన తర్వాత, ప్రతీ విద్యార్థి నల్ల బల్ల వద్దకు వచ్చి , ఆ ప్రాజెక్ట్ పనిని ఎలా నిర్వహించాడో వివరించినందుకు మార్కులు కేటాయించమన్నారు. మార్కుల సంగతి తదుపరి. కనీసం పది ప్రాజెక్ట్‌లు చేయాలి సంవత్సరంలో. తరగతిలో సుమారు 40 మంది విద్యార్థులు ఉన్నారని అనుకుందాం. ప్రతీ విద్యార్థికీ 5 నిమిషాల చొప్పున, 40 మంది విద్యార్థులకు 200 నిమిషాలు అనగా సుమారుగా 5 పీరియడ్లు. మొత్తం సంవత్సరంలో పది ప్రాజెక్ట్ లకు 50 పీరియడ్లు ఎలా కేటాయించాలో అర్థం కావడం లేదు. ఇంకా ప్రయోగశాలలో ప్రయోగ విధానం సంబంధిత అంశాలను కూడా విద్యార్థి చేత చెప్పించాలి. ఎలా సాధ్యము ?

చివరికి మా మనవి ఏమిటంటే, అయ్యా ! 10 వ తరగతి ఫిజికల్ సైన్స్ పాఠ్య పుస్తక బోధనకు చాలా అడ్డంకులు ఎదురవుతున్నాయి. పాఠ్యపుస్తకంలో ఇచ్చిన విధంగా 120 బోధన పీరియడ్లు సరిపోవు. వాటిని మార్చుకోవలసి వస్తుంది. కనుక ఇంకా అదనంగా బోధన పీరియడ్లు అవసరం అవుతాయి. అవి తరగతి గదిలో ఉండి పనిచేసిన వారికే అర్థమవుతాయి. ఫిజికల్ సైన్స్‌ను సమర్థవంతంగా విద్యార్థులకు అవగాహన కల్పించడానికి వారానికి 6 పీరియడ్లు కేటాయించి అదనంగా ఒక ప్రయోగశాల పీరియడ్‌ను వారానికి ఒకటి కేటాయించి అనగా మొత్తం 7 పీరియడ్లను కేటాయించవలసినదిగా కోరుతున్నాము.

**ఇంకా ల్యాబ్ పీరియడ్‌ను రెండు వారాల కొకసారి కేటాయించారు. అనగా ఒక వారం ఫిజికల్ సైన్స్ ల్యాబ్ అయితేమరో వారం బయాలజీ ల్యాబ్ అని అర్థం. అయితే పీరియడ్లలో ఇది అర పీరియడ్ క్రింద చూపడం జరిగినది. అలా అయితే 40మంది లేదా 50 మంది విద్యార్థులకు ఒకేసారి ప్రయోగం చేయించడం ఎలా సాధ్యపడుతుంది. కనుక ల్యాబ్ పీరియడ్‌ను ప్రతివారం ఒకటి కేటాయించాలి. అపుడు ఇద్దరు టీచర్లకు అదే రోజు అదే పీరియడ్‌లో ల్యాబ్ పీరియడ్ వేయాలి. అపుడు సగంమంది విద్యార్థులు ఫిజికల్ సైన్స్ ప్రయోగాలు చేస్తే, మరో సగం మంది బయాలజీ ప్రయోగాలు చేయడానికి వీలుపడుతుంది.కనుక ల్యాబ్ పీరియడ్‌ను తప్పని సరిగా వారానికి ఒకటి చొప్పున కేటాయించాలని మనవి చేసుకొనుచున్నాము.**

**ఇంకో ముఖ్య విన్నపము ఏమంటే 5 పీరియడ్లను అలాగే ఉంచే సందర్భంలో పదవ తరగతి నందలి సిలబస్‌ను కొంత 8, 9 తరగతులలో ముందుగా ప్రవేశ పెట్టి, పబ్లిక్ ఎగ్జామ్స్ వ్రాయు విద్యార్థులపై ఒత్తిడి తగ్గించవలసినదిగా మనవి చేసుకొనుచున్నాము.**

ఇట్లు

భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు.

**ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రము నందలి వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులకు ముఖ్య మనవి.**

**అయ్యా !**

గతంలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు ఎన్ని ఇబ్బందులు పడినారో మీకు తెలియనిది కాదు. గణిత ఉపాధ్యాయులు 24 పీరియడ్లతో ఉన్నా కూడా 31 పీరియడ్లను ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు బోధించియున్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ఒక ఉపాధ్యాయుడు ఒక విషయానికి మాత్రమే బాధ్యత వహించాలి. కనుక ఇటీవల సవరించబడిన వర్క్ లోడ్ నందు గణిత విషయాన్ని గణిత ఉపాధ్యాయుడు మాత్రమే బోధించాలి. ఫిజికల్ సైన్స్‌ను ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు మాత్రమే బోధించాలి. వర్క్ లోడ్ అడ్జస్ట్ కొరకు ఫిజికల్ సైన్స్ టీచర్ కు 7 వతరగతి సైన్స్ కేటాయించబడినది. అయితే గణిత ఉపాధ్యాయులు 6, 7 తరగతుల గణితాన్ని ఫిజికల్ సైన్స్ వారే తీసుకోవాలి అంటున్నారు. ఇప్పటికీ చాలా పాఠశాలలో 8 పీరియడ్ల టైం టేబుల్ అమలు జరగడం లేదు. ఆయా ప్రధానోపాధ్యాయులు ఎందుకు అమలు చేయలేదు. పైగా ఉత్తర్వులు మార్పిస్తున్నాము. కోర్టుకెళతాం అని కొందరు గణిత మిత్రులు అంటూ టైం టేబుల్ అమలు చేయకుండా ప్రధానోపాధ్యాయులపై ఒత్తిడి తెస్తున్నారు. ఉత్తర్వులు వెలువడి నెల కావస్తున్నా అమలు చేయకపోవడం శోచనీయం. పైగా కొన్ని ఉపాధ్యా సంఘాలు గణితం లోడ్‌ను 7 కు తగ్గించడం శాస్త్రీయం కాదు. పైగా 50 మార్కుల పేపరుకు 6 పీరియడ్లా! అని గణిత టీచర్లకు ఉద్బోధ చేస్తున్నాయి. మీ సంఘాలు అన్ని విషయాలకు సంబంధించిన టీచర్ల సంఘాలా? లేదా గణిత ఉపాధ్యాయ సంఘాలా? ఆలోచించండి. శాస్త్రీయత గురించి ఆలోచిస్తే తెలుగుకు 5 , ఇంగ్లీషుకు 5, సోషల్ కు 5 పీరియడ్లు శాస్త్రీయమని భావించారా?! అలా కాకుంటే వారి విషయాన్ని కూడా మీరు చేపట్టాలి. ఇన్ని సంవత్సరాలుగా ఫిజికల్ సైన్స్‌కు 4 పీరియడ్లు ఏ రకంగా శాస్త్రీయం అని భావించినారు? ఫిజికల్ సైన్స్ టీచర్లు ఫిజికల్ సైన్స్ 12 పీరియడ్లు మరియు గణితం (వేరే విషయం) 16 పీరియడ్లు చెప్పడం శాస్త్రీయం అని ఎలా భావించారు? 6,7 గణితం తమది కాదంటున్న గణిత ఉపాధ్యాయులు గణిత సబ్జెక్ట్ కాంప్లెక్స్ నిర్వహణ చేస్తుంటే (6,7 గణితం బోధించనప్పటికీ), ఫిజికల్ సైన్స్ టీచర్లు జనరల్ సైన్స్ కాంప్లెక్స్ లకు హాజరైనపుడు (6,7 ల గణితం చెబుతూ మరియు సైన్స్ బోధించనప్పటికీ) ఆ అశాస్త్రీయత కనబడలేదా? 50 మార్కుల పేపరుకు 6 పీరియడ్లు ఎందుకు? అన్నపుడు శాస్త్రీయత ఎక్కడ? అలా కాకుంటే వంద మార్కుల హిందీ విషయానికి 4 పీరియడ్లు మాత్రమే ఎందుకు కేటాయించారు. ఏది శాస్త్రీయత? వారికి కూడా 8 ఇవ్వమని కోరవచ్చు కదా! 50 మార్కుల ఫిజికల్ సైన్స్‌పుస్తకాన్ని గణితంతో సమానంగా అంత పెద్దగా ఎందుకు చేశారు? దానిని తెలుగు పుస్తకంలాగా చేయవచ్చు కదా! ప్రాధాన్యత దేనికి ఇవ్వాలీ అనేదే ముఖ్యం. గణిత ఉపాధ్యాయుల గురించే ఎందుకు చర్చించాల్సి వస్తుందంటే....ఈ వారు ఇలా ఫీలవుతున్నారు.....

31/07/2015, 22:00

1. వారానికి 8 periods ఉంటేనే సిలబస్ పూర్తి కావడం కష్టం మరి 7 periods తో సాద్యమా?

2.అదనంగా 6,7 తరగతులు

3.rte లో కూడా లేని rules

4. 1947 నుండి లేని rules

5. విద్యాశాఖ డైరెక్టర్ విదేశీ పర్యటనలో ఉంటే ఉత్తర్వులు ఎలా సిద్ధం అయ్యాయి. ఎవరికి లాభం?

6.సరే అదనంగా మరో sa maths అయినా sanction అవుతుందా అంటే అదీ లేదు.

7. 50+50 మార్కులకు ఇద్దరు.100 మార్కులకు ఒక్కరే. ఇది న్యాయమా?

8.నా పాఠశాల లో ఆ పరిస్థితి లేదని అనకోకండి ఉద్యమానికి సిద్దం కండి. మీ ప్రాంత maths teachrs meeting తో కార్యాచరణ రూపొందించుకోండి.

హక్కులను కాపాడుకోండి.

అయ్యా ! గణిత టీచర్లకు మేము విరోధులము కాము. విరోధమంతా గణితమే. విద్యాహక్కు చట్టం ప్రకారం ఒక విషయం ఒక ఉపాధ్యాయుడే చెప్పాలి. కనుక దాని ప్రకారం ఇన్నాళ్ళ ఫిజికల్ సైన్స్ టీచర్ల బాధలు తొలగినాయి. మాకు ఎవరి మీద ద్వేషం లేదు. అయితే ఈ విషయాన్ని నాన్చి ఇంకా అమలు కాకుండా చేస్తే నిజంగా విరోధం వారే సృష్టించినట్లు అవుతుంది. ముందు ఉత్తర్వులను అందరూ పాటించమనండి. తర్వాత కోర్టు ప్రయత్నాలు, మార్పిడులు ఎలాగైతే అలాగే. ప్రభుత్వ ఉత్తర్వులను ధిక్కరించడం ఎవరికి సాధ్యం? పాటించాల్సిందే.

అయితే వారిని న్యాయమైన కోరికలు కోరమనండి. 6,7 గణితంఫిజికల్ సైన్స్ టీచర్లు చెప్పాలి,వారికి గణిత మెథడాలజీ ఉంది .... 50 మార్కు పేపరే కదా! ఇలాంటివి కాదు. అది విద్యా హక్కుచట్టమునకు విరుద్ధం. వాళ్ళ వర్క్ లోడ్ పెంచమనండి. మరో గణిత ఉపాధ్యాయ పోస్టును కేటాయించమని కోరమనండి. కేటాయిస్తారా! అప్పటి దాకా చెప్పాలా! .... అంటే అది తర్వాత సంగతి. మేము అందుకు సర్వదా గణిత మిత్రులకు సహకరిస్తాం.మరో గణిత పోస్టును కేటాయించమని అందరం కోరదాం. లేదా ఫిజికల్ సైన్స్ టీచర్‌ను కేవలం 8, 9, 10 ఫిజికల్ సైన్స్ కు కేటాయించి, అదనంగా ఉన్న వారిని వారి ఇచ్ఛానుసారం గణితం కన్వర్షన్ చేయించే ఏర్పాటు ఉంటే ఇంకా మంచిది. అంతేగానీ ఫిజికల్ సైన్స్ టీచర్లు 6, 7 గణితం చెప్పాలనడం మంచి పద్ధతి కాదు. అవసరమున్న చోట వారు సోషల్ స్టడీస్ కూడా చెబుతున్నారని గమనించాలి.

గతంలో పాత సిలబస్ కొత్తగా మారినపుడు ఉపాధ్యాయ సంఘాల వారు ఎంతగానో కృషి చేసి చాలా పెద్ద పరిమాణంలో ఉన్న పదవ తరగతి ఫిజికల్ సైన్సెస్ పాఠ్య పుస్తకాన్ని బరువు తగ్గించుటలో ముఖ్య పాత్ర పోషించినారు. ప్రస్తుతం మారిన సి.సి.ఇ. విద్యా విధానంలో పదవ తరగతి ఫిజికల్ సైన్స్ పాఠ్య పుస్తకం అద్భుతంగా వ్రాయబడినప్పటికీ ఆచరణలో ఎదురయ్యే ఇబ్బందులను మీ దృష్టికి తీసికొని వస్తున్నాము. మేము ఏ సబ్జెక్ట్ టీచర్లకు విరోధులము కాము. మాకున్న ఇబ్బందులను తెలియజేసుకొనుటలో ఎవరినైనా నొప్పించియున్న యెడల మంచి మనసుతో మన్నించగలరని కోరుతున్నాము.

**ఇంకా ప్రస్తుతం ల్యాబ్ పీరియడ్‌ను రెండు వారాల కొకసారి కేటాయించారు. అనగా ఒక వారం ఫిజికల్ సైన్స్ ల్యాబ్ అయితే మరో వారం బయాలజీ ల్యాబ్ అని అర్థం. అయితే పీరియడ్లలో ఇది అర పీరియడ్ క్రింద చూపడం జరిగినది. అలా అయితే 40మంది లేదా 50 మంది విద్యార్థులకు ఒకేసారి ప్రయోగం చేయించడం ఎలా సాధ్యపడుతుంది. కనుక ల్యాబ్ పీరియడ్‌ను ప్రతివారం ఒకటి కేటాయించాలి. అపుడు ఇద్దరు టీచర్లకు అదే రోజు అదే పీరియడ్‌లో ల్యాబ్ పీరియడ్ వేయాలి. అపుడు సగంమంది విద్యార్థులు ఫిజికల్ సైన్స్ ప్రయోగాలు చేస్తే, మరో సగం మంది బయాలజీ ప్రయోగాలు చేయడానికి వీలుపడుతుంది. కనుక ల్యాబ్ పీరియడ్‌ను తప్పని సరిగా వారానికి ఒకటి చొప్పున కేటాయించాలని మనవి చేసుకొనుచున్నాము.**

**ఇంకో ముఖ్య విన్నపము ఏమంటే పదవ తరగతి నందలి సిలబస్‌ను కొంత 8,9 తరగతులలో ముందుగా ప్రవేశ పెట్టి, పబ్లిక్ ఎగ్జామ్స్ వ్రాయు విద్యార్థులపై ఒత్తిడి తగ్గించవలసినదిగా మనవిచేసుకొనుచున్నాము.**

వీటిని పరిశీలించి ఫిజికల్ సైన్స్ బోధనకు 5 పీరియడ్లు ఉన్నాయి. అయితే ప్రయోగశాల పీరియడ్‌ను వారానికి ఒకటి చొప్పున కేటాయించే అంశంలో ప్రభుత్వం పై ఒత్తిడిని తీసుకొనివచ్చి, దానిని సాధించుటలో మాకు గొప్ప సహాయ సహకారాలు అందజేయగలరని కోరుచున్నాము.

దయచేసి అన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఈ విషయం పట్ల శ్రద్ధ వహించి విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి తోడ్పడగలరని మనవి చేసుకొనుచున్నాము.

ధన్యవాదములు.

ఇట్లు

భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు.